సాక్షి
ములుగు

మంగళవారం । 20 । మే । 2025



పుష్కర విధుల్లో అతివలు

కాళేశ్వరంలోని సరస్వతీనది పుష్కరాల్లో పురుషులకు దీటుగా మహిళా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

- 8లో ▸



కమిషనరేట్‌లో ఏసీపీల బదిలీ

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఏసీపీల బదిలీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువులు ఏసీపీలకు స్థానచలనం కలిగింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37^0 /25^0

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి.

నదిలో దీపం వదులుతున్న కుటుంబం



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులు



త్రివేణి సంగమం.. భక్తజన సంద్రం

కాళేశ్వరంలో భక్తుల సందడి

- పుణ్యస్నానాలు ఆచరించిన వేలాది భక్తులు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

త్రివేణి సంగమం.. భక్తజన సంద్రమైంది. పుష్కరిణి స్నానం.. పులకించేలా చేసింది. వడివడిగా పరుగులు పెడుతున్న చల్లని నదిమాతల్లికి వాయినాలిచ్చే ఆడపడుచులు.. పితృదేవతలను స్మరిస్తూ తర్పణాలు వదిలే పురుషులు.. కేరింతలు కొడుతూ అల్లరి చేస్తున్న యువతులు, చిన్నారులతో నదీ ప్రాంతం సందడిగా మారింది. ఐదో రోజు సోమవారం వేలాదిగా భక్తులు కాళేశ్వరానికి తరలివచ్చారు. ముక్తీశ్వరుడిని దర్శించుకునేందుకు గంటల కొద్దీ క్యూలో వేచి చూశారు.

- మరిన్ని వివరాలు, ఫొటోలు 8లో ▸

న్యూస్‌రీల్

నేడు ములుగులో తిరంగా ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న చక్రవర్తి

ఏటూరునాగారం : దేశభక్తిని చాటేందుకు నేడు (మంగళవారం) ములుగు జిల్లా కేంద్రంలో తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదులను మట్టుబెట్టి దేశాన్ని రక్షించిన సైనికులకు మద్దతుగా జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు, పార్టీలకు అతీతంగా ఈ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గండెపల్లి సత్యం, జనార్దన్, గద్దం శ్రీధర్, యానాల చంద్రారెడ్డి, శ్రీను, నాగేశ్వర్‌రావు, దుర్గారావు, అజిత్ పాల్గొన్నారు.

పెండింగ్ రోడ్ టాక్స్ చెల్లించాలి



ములుగు : వాహనదారులు పెండింగ్‌లో ఉన్న త్రైమాసిక రోడ్డు టాక్స్‌లను చెల్లించాలని, విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని ములుగు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో సీట్ బెల్టు వేసుకోకుండా ప్రయాణిస్తే తగిన చర్యలు ఉంటాయన్నారు. గడువులోగా రుసుం చెల్లించని వాహనం తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం అధికంగా చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. వాహనదారులు తమ వెంట ఆర్సీ, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్, రోడ్ టాక్స్, హెల్మెట్‌లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాల గడువు మరో 5 సంవత్సరాలు పెంచడానికి పునరుద్ధరణ చేసుకోవాలన్నారు.

ఐరన్ పోల్స్ ఏర్పాటు



వెంకటాపురం(ఎం) : మండలంలోని రామప్ప ఆలయ పరిధిలో గల శివాలయానికి సోమవారం పురావస్తు శాఖ అధికారులు ఐరన్ పోల్స్ ఏర్పాటు చేశారు. శివగుడిగా పిలవబడే ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకొని కూలిపోవడానికి సిద్ధంగా ఉండడంతో అధికారులు ముందస్తు చర్యలో భాగంగా ఆలయం చుట్టూ ఐరన్ పోల్స్ (స్కాఫ్ హోల్డింగ్) ఏర్పాటు చేశారు. ఆలయానికి చెందిన శిల్పాలు ధ్వంసం కాకుండా ఉండేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐరన్ పోల్స్ ఏర్పాటు చేసినట్లు పురావస్తు శాఖ జిల్లా అధికారి నవీన్‌కుమార్ తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



ములుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాజాతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మల్లంపల్లి మండలంలోని రాంచంద్రాపురంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పథకాలపై కళాకారులు స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం, గృహజ్యోతి, భూభారతి, రైతు భరోసా పథకాలతో పాటు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కళాకారులు తమ ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రహీమొద్దీన్, మార్త రవి, రాగుల శంకర్, రేలా విజయ్, గోల్కొండ భిక్షపతి, అమ్మపాట తిరుపతి, కిషన్, రాజేందర్, సురేష్, భాస్కర్, నరేష్, దీపక్, శ్రీలత, శోభా, రాము తదితరులు పాల్గొన్నారు.

కాటారం డీఎస్పీ బదిలీ

కాటారం: కాటారం సబ్ డివిజన్ డీఎస్పీ గద్దం రామ్మోహన్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ సాధారణ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. కాటారం డీఎస్పీగా పని చేస్తున్న రామ్మోహన్‌రెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ భూపాలపల్లి జిల్లా డీసీఆర్‌బీ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న బి.నారాయణను కాటారం నూతన డీఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- అదనపు కలెక్టర్ సంపత్‌రావు
- ప్రజావాణిలో 37 దరఖాస్తులు



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగు : మా బాధలు వినండి.. సమస్యలు పరిష్కరించండంటూ జిల్లాలోని ఆయా గ్రామాల ప్రజలు ప్రజావాణిలో విన్నవించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో భాగంగా 37 దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు అందించి వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న వినతుల విషయంలో అలసత్వం వద్దని, ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కాగా, వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువగా భూ సమస్యలు పరిష్కరించాలని 10, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తొమ్మిది, పెన్షన్ కోసం ఇద్దరు, ఉద్యోగావకాశం కల్పించాలని ఒకరు, ఇతర సమస్యలపై 15 అర్జీలు వచ్చాయి. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి ఫైజల్ హుస్సేన్, జిల్లా మేనేజర్ రాంపతి, డీఎస్‌సీఓ లక్ష్మణ్‌నాయక్, డీసీఓ సర్దార్‌సింగ్, డీడబ్ల్యూఓ శిరీష, డీపీఓ దేవరాజ్, విద్యుత్ డీఈ నాగేశ్వర్‌రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ జయప్రకాశ్ ఉన్నారు.

నా కొడుకును ఆదుకోండి



నా కుమారుడు బొజ్జ మహేశ్ ఎనిమిది నెలలుగా అంతుచిక్కని చర్మ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇప్పటికే అనేక ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించాం. అయినా నయం కావడం లేదు. ఆర్థిక స్థోమత లేక ప్రస్తుతం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, వైద్య విభాగం తరఫున ఆర్థికంగా ఆదుకోవాలి. నా కుమారుడిని కాపాడుకోవడానికి సహకరించాలి.

- బొజ్జ సుగుణ, గోవిందరావుపేట

ఎస్సీ కార్పొరేషన్ రుణం ఇప్పించండి



నాకు ముగ్గురు ఆడపిల్లలు. దంపతులిద్దరం కూలీ చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ప్రస్తుత కుటుంబ పోషణ భారంగా మారింది. పట్టణాలకు వెళ్లి ఉద్యోగం చూసుకుందామంటే పిల్లల చదువులకు ఇబ్బందిగా ఉంది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సిమెంట్ బ్రిక్స్ యూనిట్ మంజూరు చేయిస్తే కుటుంబాన్ని కాపాడుకుంటాం.

- సంగి శిరీష, గోవిందరావుపేట

కొడుకు,కోడలి నుంచి రక్షణ కల్పించండి



నా పెద్ద కుమారుడు వల్స మధు, కోడలు సంధ్య నుంచి మాకు ప్రాణహాని ఉంది. వారి నుంచి రక్షణ కల్పించండి. నాకు ఇద్దరు కుమారులు, కూతురు. పెద్ద కుమారుడు, చిన్న కుమారుడికి ఎకరం 20 గుంటల భూమిని, ఇంటిని పంపకాలు చేశాను. తాళ్లగడ్డలోని రెండు గుంటల ఖాళీ స్థలాన్ని పెద్ద కుమారుడికి ఇచ్చాను. అయినా సరిపోనట్టు చిన్న కుమారుడి రెండు గదులను ఆక్రమించుకొని తాళం వేసుకున్నాడు. ఏంటని అడిగితే తీవ్ర పదజాలంతో తిడుతూ మెడపట్టి మమ్ములను బయటికి గెంటేశాడు. ఈ విషయంపై విచారణ చేసి తగిన న్యాయం చేయాలని కోరారు.

- వల్స సదాలయ్య, ఏటూరునాగారం

నష్ట పరిహారం ఇప్పించండి



వాజేడు : బాండ్ వరి సాగు చేయగా దిగుబడి తగ్గి నష్టాలు వచ్చాయని తమకు పరిహారం ఇప్పించాలని కోరుతూ మండల పరిధిలోని పూసూరు రైతులు కలెక్టర్ కార్యాయంలో ఫిర్యాదు చేశారు. మంగపేట మండలానికి చెందిన వేణు తమ గ్రామంలో 82 ఎకరాల బాండ్ వరి సాగు చేయించాడని తెలిపారు. ఎకరానికి రూ.42వేల పెట్టుబడి ఇచ్చి, 8 క్వింటాల దిగుబడి వస్తుందని నమ్మించినట్లు వివరించారు. దిగుబడి తగ్గితే రూ.60 వేలు నష్ట పరిహారంగా చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లుగా వెల్లడించారు. ఎకరాకు కేవలం 2 క్వింటాల దిగుబడి మాత్రమే వచ్చిందని, పరిహారం ఇవ్వాలని ఫోన్ చేస్తే ఎటువంటి సమాచారం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఎంపీడీఓ విజయ, తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. రైతులు పూనెం ప్రసాద్, బడే షణ్ముక రావు, నల్లెబోయిన పాపారావు, వాసం పెంటయ్య, బడే చిన్నన్న తదితరులు ఉన్నారు.

- కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న వాజేడు రైతులు

గిరిజన దర్బార్‌కు 12 వినతులు

- అర్జీలు స్వీకరించిన పీఓ చిత్రామిశ్రా



గిరిజన మహిళలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం : గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా సెక్టార్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ప్రజల నుంచి 12 వినతులు స్వీకరించారు. వెంకటాపురం(కె) మండలంలోని సూరవీడులో ఎదిర ఏరియా ఆస్పత్రిలో స్వీపర్ పోస్టు ఇప్పించాలని గిరిజన మహిళ కోరారు. ఏటూరునాగారం మండలం శివాపురంలోని సబ్బుల పరిశ్రమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ఐటీడీఏ ద్వారా జీసీసీ నుంచి ఇప్పించాలని నిర్వాహకులు విన్నవించారు. ఐటీడీఏ ఎదుట ఉన్న రెండు షట్టర్లలో హోటల్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇప్పించాలని వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన పలువురు జ్యూట్ బ్యాగ్ మిషన్స్, రా మెటీరియల్ సెంటర్ ఏర్పాటుకు గది ఇప్పించాలని మహిళలు ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాను కోరారు. గోవిందరావుపేట మండలం ఇప్పలగడ్డకు చెందిన ఓ గిరిజన మహిళా జగ్గన్నపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో పీఈటీ ఉద్యోగం ఇప్పించాలి విన్నవించారు. మహబూబాబాద్ జిల్లా నుంచి పీఎంహెచ్‌బీ ఆఫీస్ సబార్డినేట్ తిరిగి ఉద్యోగంలో చేర్చుకోవాలని బాధితుడు కోరారు. కార్యక్రమంలో ఏఓ రాజ్‌కుమార్, డీడీ పోచం, మేనేజర్ శ్రీనివాస్, ఆర్‌ఐటీఏ ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏఈ ప్రభాకర్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

ఆశ్రమ పాఠశాల్లోని ఎస్టీ హాస్టళ్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాగటి రవితేజ, రవి కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాకు వినతి పత్రం అందజేశారు. ఏడు నెలల నుంచి హాస్టళ్ల బిల్లులు విడుదల కాకపోవడంతో వార్డెన్లు అప్పులు చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం బిల్లులు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేయడం వల్ల తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. పాఠశాలలు ప్రారంభం అయ్యేలోపు బిల్లులు క్లియర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బాలేశ్వర్, నర్సింగరావు పాల్గొన్నారు.

- రవితేజ, రవి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ఎక్కువ ధాన్యం కొనుగోలు చేశాం..



మహేందర్‌జీ, అదనపు కలెక్టర్

ములుగు : గతంలో కంటే ఈ ఏడాది ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అధికంగా ధాన్యం కొనుగోలు చేశామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చీమలపాటి మహేందర్‌జీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం రవాణా, గన్నీ సంచుల సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రైతులు తమ సమస్యలను నేరుగా తెలియజేయడానికి పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో కంట్రోల్‌రూంతో పాటు టోల్‌ఫ్రీ నంబర్ 93474 16178ను ఏర్పాటు చేశామని తెలిపారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడకుండా ప్రిన్సిపల్ సెక్రటరీ అందించే వాతావరణ రిపోర్ట్ ఆధారంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులను అప్రమత్తం చేస్తున్నామని వివరించారు. అలాగే 2022–23 యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యం –12,882 మెట్రిక్ టన్నులు కాగా, 2023–24లో కొనుగోలు చేసిన ధాన్యం–15,699 మెట్రిక్ టన్నులు. 2,024 మొత్తం రైతులకు, 16.27 కోట్లు చెల్లించినట్లు తెలిపారు.

2024-25లో కొనుగోలు చేసిన ధాన్యం 47,449 మెట్రిక్ టన్నులు	
చెల్లించిన నగదు	రూ.61.48 కోట్లు
మొత్తం రైతుల సంఖ్య	6,599
చెల్లింపు అయిన రైతుల సంఖ్య	3,444

సుందరయ్య జీవితం ఆదర్శం

భూపాలపల్లి రూరల్: పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రమేశ్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతిని జిల్లా కమిటీ సభ్యుడు ఆకుదారి రమేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడు సుందరయ్య అని అన్నారు. గ్రామాన్ని అర్థం చేసుకోవడం అంటే దేశాన్ని అర్థం చేసుకోవడం అనే వారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెలిశెట్టి రాజన్న, వంగల విజయలక్ష్మి, గడప శేఖర్, నాయకులు సమ్మక్క, జ్ఞానేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

హేమాచలానికి పుష్కర భక్తుల తాకిడి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



భక్తులను శఠారితో ఆశీర్వదిస్తున్న పూజారి

మంగపేట : మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రానికి సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తుల సందర్శనతో రెండ్రోజుల నుంచి భక్తుల తాకిడి అధికమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలకు వచ్చి, వెళ్లే భక్తులు హేమాచల క్షేత్రంలో స్వయంభుగా వెలిసిన లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు తరలి వస్తున్నారు. సోమవారం మూడు వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు శేఖర్ శర్మ, పవన్‌కుమార్, రాజీవ్ నాగఫణి శర్మ ఈశ్వర్ చంద్ భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించారు. స్వామివారి విశిష్టత, ఆలయ పురాణాన్ని భక్తులకు వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

రెండో దఫా శిక్షణకు హాజరుకావాలి

జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని



పాణిని, డీఈఓ

గోవిందరావుపేట : రెండో దఫా శిక్షణకు ఉపాధ్యాయులు తప్పనిసరి హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటినుంచి నాలుగు రోజుల పాటు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తుందని పేర్కొన్నారు. 20వ తేదీ నుంచి తెలుగు, హిందీ, ఫిజికల్ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు మండలంలోని చల్వాయి మోడల్ స్కూల్‌లో, బయోసైన్స్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు చల్వాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ములుగు, వెంకటాపురం(ఎం), గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులకు మోడల్ స్కూల్ జవహర్‌నగర్, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం(కె), మంగపేట మండలాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఏటూరునాగారంలోని జెడ్పీఎస్ఎస్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తారని వివరించారు. ప్రతి ఉపాధ్యాయుడు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:30 వరకు విధిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

పుష్కరాల్లో పోలీసు జులుం!

- ఇబ్బందులు పడుతున్న భక్తులు
- కాళేశ్వరం వాసులకు తప్పనితిప్పలు



ఎస్సై దురుసు ప్రవర్తనతో రోడ్డుపై బైఠాయించిన కాళేశ్వరం గ్రామస్తులు

కాళేశ్వరం: కాళేశ్వరంలో సరస్వతీనది పుష్కరాలకు వచ్చి విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల తీరు మారడం లేదు. భక్తుల పట్ల మర్యాదను మరిచారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చాం.. మాకు ఏమి కాదనే భావనతో విధులు నిర్వర్తిస్తూ భక్తులకు శాపంగా మారారనే విమర్శలను పోలీసులు మూటకట్టుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలకు కళాకారులతో వచ్చిన ఓ ట్రావెల్‌ను కాళేశ్వరంలోని గుండం చెరువు వద్ద విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ నిలిపి వారిని దేవస్థానం ఆవరణకు వెళ్లడానికి అనుమతి ఇవ్వలేదు. వారితో వాగ్వాదానికి దిగాడు. 'కరీంనగర్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తాను.. నాకు ఏమి కాదు..వీడియో కూడా తీసుకొండి' అంటూ ప్రస్తుత ప్రభుత్వంపై దుర్భాషలాడినట్లు తెలిసింది. సోమవారం దేవస్థానంలోకి వెళ్లడానికి వస్తున్న దేవాదాయశాఖ ఏడీసీ కేడర్ అధికారినితో అక్కడున్న ఎస్సై స్థాయి అధికారులు అడ్డుకొని అనుమతివ్వలేదు. ఆమెతో వాగ్వాదానికి దిగారు. పైగా పోలీసు, దేవాదాయ, ఉత్సవ కమిటీ, విలేకరుల సిఫారసులపై వచ్చిన వారిని కూడా ఇబ్బందులకు గురిస్తున్నారు.

నిన్ను పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెడతా..

కాళేశ్వరం గ్రామానికి చెందిన ఇద్దరు సోదరులు వారి కుటుంబ సభ్యులతో పుష్కర స్నానానికి సరస్వతీఘాట్‌కు బైక్‌పై వెళుతుండగా ములుగు జిల్లాకు చెందిన ఓ ఎస్సై వారిని అడ్డుకున్నారు. పాస్‌లు ఉంటే పంపిస్తామన్నారు. కాళేశ్వరం గ్రామస్తులకు పాస్‌లు ఎక్కడ తీసుకురావాలనగా బైక్ కీ తీసుకున్నాడు. దీంతో అతని వదినతో మహిళ అని చూడకుండా 'నిన్ను పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెడతా' అంటూ పోలీసు జులుం ప్రదర్శించాడు. దీంతో వారు అక్కడే కాసేపు పోలీసు తీరుపై బైఠాయించడం వ్యతిరేకంగా నినాదాలు చేయడం చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో ఓ ఎమ్మెల్యే కాన్వాయ్ రావడంతో ఆయన వాహనానికి అడ్డువెళ్లగా ఏంటని ప్రశ్నించాడు. దీంతో జరిగిన విషయం తెలపడంతో ఆ ఎస్సైతో వాహనం తాళం చెవి ఇప్పించి వెళ్లాడు. కాగా, అతనిపై ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. దేవస్థానం, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్, ఘాట్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్, ఎస్సైల స్థాయి వారితో ఆ శాఖకు అప్రతిష్ట జరుగుతుందని, ఐపీఎస్ స్థాయి అధికారులు ఎంత చెప్పిన వారి పోలిసింగ్ చూపెడుతున్నారని ప్రజలు మొరపెట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

చిన్న కాళేశ్వరం పనుల అడ్డగింత



అధికారులతో మాట్లాడుతున్న రైతులు

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా కాటారం శివారులోని 501లో కొనసాగుతున్న కాల్వ నిర్మాణ సర్వే పనులను భూ నిర్వాసిత రైతులు సోమవారం అడ్డుకున్నారు. పరిహారం ఇవ్వకుండా పనులు చేపడితే ఊరుకునేది లేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. రికార్డుల్లో నష్ట పరిహారం అందినట్లు ఉందని నిబంధనల ప్రకారం తాము పనులు చేపడుతామని సర్వే, ఇరిగేషన్ అధికారులు రైతులకు తేల్చిచెప్పారు. తమకు ఎలాంటి పరిహారం అందలేదని, పరిహారం ఇవ్వకుండా పనులు చేపడితే ఆత్మహత్య చేసుకుంటామని రైతులు హెచ్చరించారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు నిర్వాసిత రైతులకు స్పష్టం చేశారు. పనులు అడ్డుకున్న వారిలో రైతులు దుర్గం తిరుపతి, సాంబమూర్తి, తదితరులు ఉన్నారు.


నదికి మొక్కుతున్న భక్తులు


చిన్నారికి స్నానం చేయిస్తున్న కుటుంబీకులు


భక్తురాలి పూనకం


పుణ్యస్నానానికి వస్తున్న భక్తజనం

సరస్వతీయే నమః పుష్కరాలు - 2025

పుష్కరం.. పుణ్యఫలం..


ఉదకం వదులుతున్న భక్తులు


స్నానమాచరిస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ కుటుంబం


హారతి తీసుకుంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్



పుష్కరుడికి నీళ్లు వదులుతున్న మహిళలు


నది తీరంలో భక్తుల కోలాహలం


నదిలో కుటుంబం సంతోషం

కాళేశ్వరంలో ఇద్దరికి గుండెపోటు


అస్వస్థతకు గురైన కానిస్టేబుల్‌ను 108లో తరలిస్తున్న సిబ్బంది

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరంలో ఇద్దరు భక్తులు ఆదివారం గుండెపోటుకు గురయ్యారు. ముక్తీశ్వరస్వామి ఆలయ సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పాండునాయక్ స్పృహతప్పి పడిపోవడంతో అక్కడే విధుల్లో ఉన్న డాక్టర్ రఘురామ్, సిబ్బంది సీపీఆర్ చేసి ప్రథమ చికిత్స అందించారు. అలాగే, ఏపీలోని పిఠాపురానికి చెందిన కె.వీర్రాజు వీఐపీ ఘాట్ వద్ద ఎండ వేడికి కళ్లు తిరిగి కింద పడిపోగా బీపీ తగ్గింది. దీంతో 108లో పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించిన అనంతరం వరంగల్ ఎంజీఎం తరలించినట్లు వైద్యాధికారులు తెలిపారు.

ప్రముఖుల పుష్కర స్నానం..



స్వామిజీకి సరస్వతీమాత విగ్రహం బహూకరిస్తున్న అధికారులు, పుష్కర స్నానమాచరిస్తున్న హైకోర్టు జడ్జి నర్సింగరావు దంపతులు

కాటారం/కాళేశ్వరం: సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా సోమవారం పలువురు ప్రముఖులు పుష్కర స్నానం ఆచరించారు. డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, హైకోర్టు జడ్జి నందికొండ నర్సింగరావు దంపతులు, త్రయంబకేశ్వర్ నాసిక్‌కు చెందిన మహామండలేశ్వర్ ఆచార్య సంవిధానందాసరస్వతి మహారాజ్ స్వామి సరస్వతి ఘాట్ వద్ద త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం సరస్వతి మాతను దర్శించుకుని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జడ్జి దంపతులను కలెక్టర్ రాహుల్‌శర్మ, భూపాలపల్లి న్యాయమూర్తి అఖిల మర్యాదపూర్వకంగా కలిసి సరస్వతీమాత చిత్రపటం అందజేశారు. ఆలయ అధికారులు సంవిధానందాసరస్వతి మహారాజ్ స్వామికి సరస్వతీమాత విగ్రహం బహూకరించారు.

శివుడి ప్రతిమ సెట్టింగ్‌కు మంటలు


మంటలు ఆర్పుతున్న పోలీసులు

కాటారం: పుష్కరాల్లో భాగంగా సరస్వతి(వీఐపీ)ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన శివుడి ప్రతిమ సెట్టింగ్‌కు సోమవారం మంటలు అంటుకున్నాయి. థర్మకోల్‌తో తయారు చేసిన శివుడి ప్రతిమ సెట్టింగ్ వద్ద భక్తులు పుష్కర స్నానం అనంతరం దీపాలు వెలిగిస్తున్నారు. ఈ క్రమంలో దీపాలు ప్రతిమ కింద గల థర్మకోల్ స్టాండ్‌కు అంటుకుని మంటలు చెలరేగాయి. అక్కడే డ్యూటీలో ఉన్న పోలీసులు నీళ్లతో మంటలు ఆర్పారు. భక్తులు దీపాలు వెలిగించకుండా చర్యలు చేపట్టారు.

పుష్కర విధుల్లో అతివలు..

పురుషులకు దీటుగా మహిళా ఉద్యోగుల సేవలు

- అధికంగా పోలీస్, వైద్యారోగ్య, శిశు సంక్షేమ శాఖలు
- భక్తిభావంతో పన్నెండు రోజుల పాటు విధుల నిర్వహణ

కాటారం/మల్హర్ : ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు.. ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పురుషులతో సమానంగా పోటీపడుతూ ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థానంలో నిలుస్తున్నారు. ఉద్యోగాలు పొందిన అనంతరం విధి నిర్వహణలో పురుషులతో సరిసమానంగా ముందుకెళ్తున్నారు. ఎంతకష్టమైనా ఉన్నతాధికారులు కేటాయించిన విధులు సమర్థవంతంగా పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాల్లో మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో విధులు నిర్వర్తిస్తున్నారు. పోలీస్, వైద్యారోగ్య, మహిళా, శిశు సంక్షేమ శాఖల్లో పలు కేడర్లకు చెందిన మహిళా ఉద్యోగులు, సిబ్బంది పుష్కరాల్లో భక్తులకు సేవలందిస్తున్నారు.


ప్రధాన ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఎస్సై

సుమారు 300 మంది మహిళా ఉద్యోగులు..

సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా పోలీస్, వైద్యారోగ్య, మహిళా, శిశు సంక్షేమశాఖల పరిధిలో సుమారు 300 మంది మహిళా ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. ఇందులో పోలీస్‌శాఖలో సుమారు 80 మంది మహిళా ఎస్సైలు, కానిస్టేబుళ్లు, వైద్యారోగ్య శాఖలో 30 మంది మహిళా వైద్యులు, 120 మంది ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు, మహిళా, శిశ ుసంక్షేమ శాఖకు సంబంధించి సుమారు 70 మంది మహిళా ఉద్యోగులు, సిబ్బంది భక్తులకు తమ శాఖల ద్వారా సేవలు అందిస్తున్నారు. ప్రధాన ఆలయం, త్రివేణి సంగమం, సరస్వతి పుష్కరఘాట్ వద్ద విధులు నిర్వర్తిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పలువురు మహిళా ఉద్యోగులు 'సాక్షి' పలకరించగా తమ అనుభూతులను పంచుకున్నారు.

భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉంది..


పన్నెండేళ్లకు ఒక సారి వచ్చే పుష్కరాల్లో భాగంగా భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉంది. ఉద్యోగ పరంగానే కాకుండా సేవ చేయాలనే ఉద్దేశంతో పుష్కర విధులకు వచ్చా. కొన్ని సందర్భాల్లో కష్టం అనిపించినా ఓర్చుకుని ముందుకెళ్తున్నా..

– లలిత, ఎస్సై

మహిళలు, చిన్నారులకు ప్రత్యేక సేవలు..


పుష్కరాల్లో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, మహిళలు, చిన్నారులకు ప్రత్యేక సేవలందిస్తున్నాం. ప్రతీ రోజు దగ్గర ఉండి పుష్కరాలకు వచ్చే మహిళలు, చిన్నారులకు న్యూట్రీషన్ ఫుడ్ అందిస్తున్నా. రెగ్యులర్ డ్యూటీ అయినా ఇంత గొప్పగా కొనసాగుతున్న పుష్కరాల్లో సేవలు అందించడం సంతోషంగా ఫీల్ అవుతున్నా..

– మల్లీశ్వరి, జిల్లా సంక్షేమాధికారి, భూపాలపల్లి

భక్తిభావంతో పని చేస్తున్నా..


పుష్కరాల్లో భక్తి భావంతో భక్తులకు వైద్య సేవలందిస్తున్నా. పుష్కరాల్లో డ్యూటీ చేయడం కొత్త అనుభూతి ఇస్తుంది. నిత్యం అనేక మంది భక్తులు ఏదో ఒక రకమైన వైద్యం కోసం మా దగ్గరకు వస్తున్నారు. వారి ఆధ్యాత్మిక చింతన చూస్తే ఆనందం అనిపిస్తుంది.

– అఖిల, వైద్యురాలు

అదృష్టంగా భావిస్తున్నా..


పుష్కరాల్లో విధుల్లో భాగంగా భక్తులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. నేను మొదటి సారి పుష్కరాల విధుల్లో పాల్గొన్నా. కాళేశ్వర ఆలయ ఆవరణలో దైవసేవలో ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా ఏకాగ్రతతో పని చేస్తున్నా. మాపై ఆ స్వామి వారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నా.

– ప్రవళిక, కానిస్టేబుల్

పుష్కర ఏర్పాట్లు భేష్..

- ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రు నాయక్


ఏర్పాట్లపై కలెక్టర్‌తో మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే

కాటారం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాల ఏర్పాట్లు భేష్‌గా ఉన్నాయని ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి విప్ కుటుంబ సమేతంగా సోమవారం పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పుష్కర ఏర్పాట్లు పరిశీలించి కలెక్టర్, అధికారులను అభినందించారు. విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కాళేశ్వర ముక్తీశ్వరుడిని కోరుకున్నట్లు తెలిపారు.

అనుమానిస్తున్నాడని.. కడతేర్చారు

- వ్యక్తి హత్య కేసులో అత్తామామ, భార్య అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్ : వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్యను అనుమానిస్తున్నాడని భర్తను అత్తామామ, భార్య కలిసి కడతేర్చారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధర్మారం తండాలో చోటుచేసుకుంది. ఈ హత్య కేసు వివరాలను మహబూబాబాద్ డీఎస్పీ ఎస్.తిరుపతిరావు సోమవారం రూరల్ పీఎస్‌లో వెల్లడించారు. తండాకు చెందిన బానోత్ వీరన్న కూతురు మౌనికను తొమ్మిది సంవత్సరాల క్రితం బల్లార్ష ప్రాంతానికి చెందిన లకావత్ బాలకు ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఇద్దరు కుమారులు ఉండగా, 5 సంవత్సరాల నుంచి దంపతులు హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో మౌనిక వివాహేతర సంబంధ విషయంలో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మౌనిక తన తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. ఇదే విషయమై ఈ నెల 17వ తేదీన బాల, అతడి అన్న లకావత్ బావుసింగ్ ధర్మారం తండాకు వెళ్లి మౌనికతో గొడవ పెట్టుకున్నారు. అంతలోనే భార్య మౌనిక, మామ వీరన్న, అత్త కైల కలిసి బాల, బావుసింగ్ కళ్లలో కారం చల్లారు. దీంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. కొద్ది సమయం తర్వాత బాల తన అత్తగారింటికి వెళ్లి తమను చంపాలని చూస్తారా అని గొడవ పెట్టుకున్నాడు. ఆ వెంటనే అతడి భార్య మౌనిక, అత్త కైల కొట్టగా మామ వీరన్న కత్తితో ఛాతీలో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన బాలను 108లో మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అదే రాత్రి 10 గంటలకు మృతిచెందాడు. ఈ ఘటనలో అత్తామామ వీరన్న, కైల, భార్య మౌనికను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

కమిషనరేట్‌లో ఏసీపీల బదిలీ

వరంగల్ క్రైం: రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఏసీపీ బదిలీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఏసీపీలు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 77 మంది ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ డాక్టర్ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సంపేట ఏసీపీగా పనిచేసిన వి.కిరణ్‌కుమార్.. డీజీపీ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఖమ్మం సీసీఆర్‌బీ ఏసీపీగా పనిచేస్తున్న పున్నం రవీందర్‌రెడ్డి బదిలీపై వచ్చారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ విభాగం డీఎస్పీగా పనిచేసిన పి.ప్రశాంత్‌రెడ్డిని కాజీపేట ఏసీపీగా, మామునూరు ఏసీపీగా పనిచేస్తున్న బి.తిరుపతి డీజీపీ కార్యాలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో ఖమ్మం ఎస్‌బీ ఏసీపీగా పనిచేస్తున్న ఎన్.వెంకటేష్ బదిలీపై వచ్చారు. రాచకొండ 'షీ' టీమ్ ఏసీపీగా పనిచేస్తున్న పి.నర్సింహారావు హనుమకొండ ఏసీపీగా, హనుమకొండ ఏసీపీగా పనిచేస్తున్న కొత్త దేవేందర్ రెడ్డి డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. సీఐడీ డీఎస్పీగా పనిచేస్తున్న పి.సదయ్య వరంగల్ సీసీఎస్ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఇప్పటికే బదిలీ అయిన స్థానాల్లో పలువురు ఏసీపీలు రిపోర్టు చేశారు. నర్సంపేట ఏసీపీగా పనిచేసిన కిరణ్‌కుమార్ సీసీఎస్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. పి.ప్రశాంత్‌రెడ్డి కాజీపేట ఏసీపీగా, నర్సంపేట ఏసీపీగా పున్నం రవీందర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కొత్తగా వెలువడిన ఉత్తర్వుల్లో సీసీఎస్ ఏసీపీగా పి.సదయ్య బదిలీ అయినట్లు ఉండడం గందరగోళానికి తావిస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో బదిలీ ఉత్తర్వులపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు.

ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శిగా వలీఉల్లాఖాద్రీ


కేయూ క్యాంపస్: అఖిల భారత యువజన సమైక్య(ఏఐవైఎఫ్) జాతీయ కార్యదర్శిగా వరంగల్‌కు చెందిన డాక్టర్ వలీ ఉల్లాఖాద్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీలోని తిరుపతిలో నాలుగురోజులుగా నిర్వహించిన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో వలీఉల్లాఖాద్రీని జాతీయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. వలీఉల్లాఖాద్రీ తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్రపోషించారు. కేయూ వేదికగా అనేక ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. ఆ తర్వాత ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా కూడా దేశం వ్యాప్త విద్యార్థి ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. వలీఉల్లాఖాద్రీ కేయూలో కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ విభాగం నుంచి డాక్టరేట్ పొందారు.

ఓరుగల్లు కీర్తి ప్రతిష్టను పెంచేలా..

- అత్యాధునిక హంగులతో వరంగల్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ
- 22న వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ (ఏసీఎం) ఎస్ఆర్.మూర్తి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రైల్వే ఏసీఎం మూర్తి

ఖిలా వరంగల్ : ఓరుగల్లు కీర్తి ప్రతిష్టతను మరింత పెంచేలా.. అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దిన వరంగల్ రైల్వేస్టేషన్‌ను ఈనెల 22న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ (ఏసీఎం) ఎస్ఆర్.మూర్తి తెలిపారు. ఈమేరకు సోమవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.25.41కోట్ల వ్యయంతో అమృత్ భారత్ స్టేషన్ కింద తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా వరంగల్ రైల్వే స్టేషన్ సరికొత్తగా రూపుదిద్దుకుందన్నారు. విశాల ప్లాట్ ఫామ్‌లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, విశ్రాంతి గదులు, ఆధునిక టాయిలెట్లు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. స్టేషన్ గోడలకు కాకతీయుల కళావైభం ఉట్టిపడేలా రంగుల చిత్రాలు వేశామని, ప్రయాణికులకు సరికొత్త అనుభూతి కలిగేలా ఆహ్లాదం, పచ్చని తోరణాలు, ఆకట్టుకునే విద్యుత్ కాంతులు, 12 ఫీట్ల వెడల్పుతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించామని వివరించారు. అనంతరం రైల్వే స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇన్‌చార్జ్ స్టేషన్ మేనేజర్ కె.సారయ్య, సీసీఐ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, ఐఓడబ్ల్యూ శ్రీనివాస్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు..

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని పలు పాఠశాలల్లో దక్షిణ మధ్య రైల్వే అధికారులు 'మేరా అమృత్ స్టేషన్ అండ్ ఆపరేషన్ సిందూర్' అనే అంశంపై విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ సోమవారం తెలిపారు. ఈ నెల 22న ప్రధాని మోదీ అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 103 పునరాభివృద్ధి చేసిన రైల్వే స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభిస్తారని, వీటిలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లో వరంగల్, కరీంనగర్, బేగంపేట స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం, సోమవారం వరంగల్, రామగుండం, కరీంనగర్‌లో వివిధ పాఠశాలల్లో వ్యాస రచన, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించగా 170 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వరంగల్ అమృత్ భారత్ స్టేషన్ ప్రారంభోత్సవం రోజున విజేతలకు ముఖ్య అతిథులతో సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు సీపీఆర్వో తెలిపారు.

త్వరలో జిల్లాకు క్రికెట్ స్టేడియం

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు షురూ


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ

వరంగల్ స్పోర్ట్స్: జిల్లాలో క్రికెట్ స్టేడియం నిర్మాణ అంశాన్ని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు తీసుకెళ్లారని, త్వరలోనే స్టేడియం ఏర్పాటు ప్రకటన వెలువడనుందని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ రెడ్డిపురంలో సోమవారం అంతర్‌జిల్లాల క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో బీజంపడిన క్రికెట్ స్టేడియం నిర్మాణం.. ఇప్పుడు ఆచరణలోకి రానుందని, అందుకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో పాటు తానుకూడా ముందుండి నిర్మాణం జరిగేలా చొరవచూపుతానని భరోసా కల్పించారు. క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ రెడ్డిపురంతో పాటు మొగిలిచర్ల గ్రౌండ్‌లో జనగామ, ములుగు, వంగాలపల్లి మైదానంలో వరంగల్, మహబూబాబాద్ జట్ల మధ్య లీగ్ మ్యాచ్‌లు కొనసాగాయని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సదాశివ్, తోట రాము, సంయుక్త కార్యదర్శి ఉపేందర్ పాల్గొన్నారు.